క్లుప్తంగా

రేపు 'చాగంటి' ఆధ్యాత్మిక ప్రవచనాలు

విజయవాడ కల్చరల్: విశ్వజనని పరిషత్ ట్రస్ట్, విశ్వమాత చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు మాతా జిల్లెలమూడి అమ్మ శత జయంతి వేడుకల సందర్భంగా ఆధ్యాత్మిక వేత్త, టీటీడీ ధార్మిక మండలి సభ్యులు చాగంటి కోటేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందని నిర్వాహక సంఘ సభ్యులు నిడుమోలు రమాసత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మ భక్తులతోపాటు, చాగంటి అభిమానులు పాల్గొంటారని పేర్కొన్నారు.

వైభవంగా శ్రీ కృష్ణ కల్యాణం



విజయవాడ కల్చరల్: శివరామకృష్ణ క్షేత్రం (రామకోటి) వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం దేవాలయ ప్రాంగణంలో వీరుభొట్ల లక్ష్మీకుమార శర్మ ఆధ్వర్యాన ఆగమశాస్త్ర సంప్రదాయాన్ని అనుసరించి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ కృష్ణుని కల్యాణం మహాశక్తి పాశుపతం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. దేవాలయ ధర్మాధికారి హనుమత్ ప్రసాద్, పూర్వ ధర్మాధికారి జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

నేడు మహా శివలింగానికి విభూది అభిషేకాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహా శివరాత్రి సందర్భంగా శనివారం లెనిన్ సెంటర్‌లోని ఓంశ్రీ షిర్డీనాగసాయి బాబా–నాగమానసాదేవి మందిర ప్రాంగణంలోని మహాశివలింగానికి విభూది అభిషేకం నిర్వహిస్తున్నట్లు మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు కె. సుధాస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం తెల్లవారు జామునుంచి రాత్రి 8 గంటల వరకు అభిషేకాలు జరుగుతాయని తెలిపారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త అద్దంకి సత్యనారాయణ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకనటలో తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

సీఐ వెంకటనారాయణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటనారాయణ హెచ్చరించారు. శుక్రవారం గాంధీనగర్, ఎన్నార్పీ రోడ్డు, రైల్వేస్టేషన్ పరిసరాల్లో సిబ్బందితో కలసి గస్తీ తిరిగి పలువురు అనుమానితులను విచారణ చేశారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహనకు కృషి

విజయవాడ కల్చరల్: శాస్త్ర సాంకేతిర రంగాలపై సామాన్యుల్లో అవగాహన కలిగించి వారిని చైతన్య పరచడానికి కృషి చేస్తున్నట్లు ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరావు అన్నారు. చైతన్య వేదిక ఆధ్వర్యాన 12వ జాతీయ మహాసభల పరిచయ కార్యక్రమాన్ని శుక్రవారం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద నిర్వహించారు. అనంతరం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రతినిధి చింతకాయల చిట్టిబాబు, డేవిడ్‌రాజు, శ్యాంప్రసాద్, చలపతి రావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపాలని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్ అన్నారు. నగరంలోని జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను జాయింట్ కలెక్టర్ అభినందించారు. యనమలకుదురు కేకే అకాడమీకి చెందిన బి.యశ్వంత్, బాలికల విభాగంలో పి .రంగ లక్ష్మి అండర్ –19 జట్టుకు, ఎస్. .లాక్షణ్యస్తుతి అండర్ –15 జట్టుకు ఎంపికయ్యారు. వవీరికి క్రికెట్ బ్యాట్స్ అందజేశారు. జేసీని కలిసిన వారిలో కేకే అకాడమీ స్థాపకులు డి. వంశీ ప్రియ, హెడ్ కోచ్ జానకిరామ్ ఉన్నారు

కంటి, దంత వైద్య పరీక్షలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విజయవాడ వాకర్స్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యాన శుక్రవారం కేటీ రోడ్డులోని సెయింట్ థామస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో విద్యార్థులకు ఉచితంగా కంటి, దంత వైద్య పరీక్షలు చేశారు. మాక్సివిజన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు, హాసిని హాస్పటల్స్ ఆధ్వర్యాన దంత వైద్య పరీక్షలు జరిగాయి.

తీరనున్న విద్యుత్ వెతలు

- జీవీఆర్ నగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం
- పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రూ.3.6 కోట్లతో సబ్‌స్టేషన్
- చురుగ్గా విద్యుత్‌లైన్ల ఏర్పాటు పనులు



జీవీఆర్‌నగర్‌లో రూ.3.6 కోట్లుతో నిర్మిస్తున్న ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ వాసుల విద్యుత్ వెతలు తీరనున్నాయి. డివిజన్‌లో జీవీఆర్‌నగర్, దేవీనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్యలు ఎదురవుతున్నాయి. పలుసార్లు గృహోపకరణాలు కాలిపోయాయి. ఈ ప్రాంతంలో జనాభా పెరుగుతుండటంతో చాలాసార్లు విద్యుత్ ఓల్టేజీ ఇబ్బందులతో ప్రజలు అవస్థ పడుతున్నారు. దీంతో విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి ఎమ్మెల్యే మల్లాది విష్ణు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.3.6కోట్లు మంజూరు చేయించారు. అయితే స్థల సమస్య ఇబ్బందిగా మారింది. ఎమ్మెల్యే విష్ణు చొరవ చూపి ఓ ప్రయివేట్ స్థల యజమానులతో మాట్లాడటం, అక్కడ సబ్‌స్టేషన్ నిర్మాణానికి వారు అంగీకరించడంతో ఏడాది క్రితం పనులు ప్రారంభించారు.

వేగంగా సబ్‌స్టేషన్ పనులు

సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. విద్యుత్‌లైన్ల ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడ విద్యుత్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే దేవీనగర్, గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ , వినాయకనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తీరతాయి. స్థలాభావం కారణంగా ఇండోర్ సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నామని అధికారులు తెలిపారు. అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానం వినియోగిస్తుండటంతో విద్యుత్ అంతరాయాలు ఉండవని, నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం ఇవ్వవచ్చని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ ఇప్పటికే పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ఆరు ఫీడర్లు అమర్చారు.



ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్

9511 గృహాలు, 700 వాణిజ్య వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

జీవీఆర్‌నగర్ విద్యుత్ ఇండోర్ స్టేషన్ నిర్మాణంతో 9,511 గృహాలు, 700 వాణిజ్య వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించవచ్చు. 253 ట్రాన్స్‌ఫార్మర్లను ఈ సబ్‌స్టేషన్‌కు కనెక్ట్ చేయనున్నారు. వేసవి ప్రారంభమయ్యేలోపు పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు వేగంగా పని చేస్తున్నారు.

ప్రాజెక్టుల పెండింగ్ పనులు పూర్తి చేయండి

జేసీ శ్రీవాస్‌నుపూర్ అజయ్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో చేపడుతున్న రైల్వే, ఆర్ అండ్‌బీ, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులకు సంబంధించిన వివిధ స్థాయిల్లో ఉన్న పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో పెండింగ్ పనులపై శుక్రవారం జేసీ సమావేశం నిర్వహించారు. కొండపల్లి– కాజీపేట స్టేషన్ల మధ్య జి.కొండూరు మండలంలోని చెరువు మాధవరం, తెల్లదేవరపాడు గంగినేనిపాలెం, దుగ్గిరాలపాడు గ్రామాలు, విజయవాడ నార్త్‌లోని గుణదల, విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడి, జక్కంపూడి గ్రామాలలో రైల్వే డబ్లింగ్, థర్డ్ లైన్ ఓవర్ రైల్ ఫ్లైఓవర్ నిర్మాణ పనుల తుదిదశ పెండింగ్ పనులు, ఇతర ప్రక్రియలు పూర్తి చేయాలన్నారు. జగ్గయ్యపేట ముక్త్యాల వద్ద ఇన్ ల్యాండ్ వాటర్ టెర్మినల్‌కు అవసరమైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నందిగామ ఆర్డీఓను ఆదేశించారు. విజయవాడ నుంచి ఖమ్మం గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిలో స్టోన్ ప్లాంటేషన్ పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారి–16, 65 విస్తరణ పనులలో ప్రగతి చూపాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో కె. మోహన్‌కుమార్, నందిగామ, తిరువూరు ఆర్డీఓలు రవీంద్రరావు, వై.వి. ప్రసన్నలక్ష్మి, కలెక్టరేట్ సూపరిండెంటెంట్ దుర్గాప్రసాద్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

పాయకాపురం(విజయవాడరూరల్): అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన గిరిజగడ్డ మురళి(37) కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద పది వేల రూపాయల ఆర్థిక సాయాన్ని మట్టి ఖర్చుల నిమిత్తం వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం అందచేశారు. కార్యక్రమంలో పార్టీ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్, నాయకులు వెంకట్, సాంబయ్య, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): జూడో విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన జూడో కోచ్ పై నున్న రూరల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెన్నైలో జరిగే నేషనల్ జూడో పోటీల్లో పాల్గొనేందుకు విశాఖపట్నానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. వీరిని మెడికల్ టెస్ట్ కోసం కోచ్ చింతపల్లి సామ్యేల్‌రాజు(చిన్ని) గురువారం రాత్రి విజయవాడ తీసుకొచ్చారు. ట్రైన్ ఆలస్యం కావడంతో నున్న రూరల్ పోలీసు స్టేషన్ సమీపంలోని కండ్రికలో ప్రైవేటు జూడో సెంటర్‌కు ప్రాక్టీస్ కోసం వెళ్లారు. అతను మద్యం తాగి మైనర్ విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆ విద్యార్థిని విజయవాడలోని తమ బంధువులకు జరిగిన విషయం తెలిపింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కోచ్‌ను అరెస్ట్ చేసి అతనిపై పోక్సో కేసు నమోదు చేశారు.

ఆదిదంపతుల నగరోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రావణబ్రహ్మ వాహనంపై శ్రీ గంగా, భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి నగర వీధుల్లో భక్తులకు కనువిందు చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ వసంత మల్లికార్జునస్వామి దేవస్థానాలకు చెందిన స్వామి వార్ల ఉత్సవమూర్తులతో నగరోత్సవాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ ఈఓ భ్రమరాంబ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ వి.జగన్నాథాన్ని ప్రధాన ఆలయానికి, ప్రొవిజన్ స్టోర్స్‌లో విధులు నిర్వహిస్తున్న కృష్ణవేణిని స్టేషనరీ విభాగానికి, నాగరాజును కొండ దిగువన టికెట్ల జారీ కౌంటర్ నుంచి పేబిల్స్ విభాగానికి, కె. దుర్గాప్రసాద్‌ను టోల్‌ఫ్రీ నుంచి కొండ దిగువన టికెట్ల జారీ కౌంటర్‌కు, ఎస్. లక్ష్మణస్వామిని శారీస్, మెయిన్ టెంపుల్ నుంచి ప్రొవిజన్ స్టోర్స్‌కు, జే.ఆదినారాయణను దత్తత దేవాలయాల నుంచి కొండ దిగువన టికెట్ల జారీ కౌంటర్‌కు బదిలీ చేశారు. టి.సుబ్రహ్మణ్యంను ట్రస్టు బోర్డు నుంచి మాడపాటి సత్రానికి, ఎ. నరేంద్రను టోల్‌ఫ్రీ కౌంటర్‌కు , సీహెచ్ సాయికిరణ్‌ను సత్రాలు, కేశఖండన శాల విధులతో పాటు ఇ1 బాధ్యతలు అప్పగించారు. రికార్డు అసిస్టెంట్ ఎస్. నళిని ఇంజినీరింగ్ విభాగం నుంచి పరిపాలన, స్టేషనరీ విభాగానికి, ఎస్ఎంఆర్ వి.రమణబాబును ఇంజినీరింగ్ విభాగంతో పాటు ఇ1 విధులు కేటాయించారు. జి.సాంబయ్యను మాడపాటి సత్రం నుంచి శారీస్ విభాగానికి, నాగేశ్వరరావును రైల్వే స్టేషన్ నుంచి మైక్ రూమ్ నిర్వహణ బాధ్యతలు, స్వీపర్ కె. పాపయ్యను టెంపుల్ నుంచి రైల్వే స్టేషన్ ప్రసాదాల కౌంటర్‌కు, అటెండర్ కె. వీరబాబును శారీస్ విభాగం నుంచి ట్రస్ట్ బోర్డుకు, ఎ. రాజశేఖర్‌ను ట్రస్టు బోర్డు నుంచి చీరల కౌంటర్‌కు బదిలీ చేశారు.

బెల్లంకొండతో అభ్యుదయ సాహిత్యం సుసంపన్నం



బెల్లంకొండ శతజయంతి సభలో మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్ట్ రెంటాల జయదేవ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగునాట అభ్యుదయ సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన రచయితల్లో బెల్లంకొండ రామదాసు ఒకరని ప్రముఖ పాత్రికేయులు రెంటాల జయదేవ్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో ప్రముఖ రచయిత బెల్లంకొండ రామదాసు శతజయంతి సభను గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై శుక్రవారం రాత్రి జరిగింది. జయదేవ్ మాట్లాడుతూ కవిగా, నాటకకర్తగా, సినిమా వ్యక్తిగా, జర్నలిస్టుగా వివిధ రూపాల్లో అపూర్వమైన సాహిత్యాన్ని బెల్లంకొండ అందించారన్నారు. అనేక అద్భుత సాహిత్య గ్రంథాలు రాసిన బెల్లంకొండకు సరైన గుర్తింపు రాలేదన్నారు. సోషలిస్టు పత్రికకు సంపాదకులుగా పని చేసిన ఆయన అభ్యుదయ సాహితాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. సినీ రంగానికి వెళ్లినా తిరిగి మళ్లీ సాహితీవేత్తగానే జీవితాన్ని గడిపారన్నారు. మరోవక్తగా సాహితీవేత్త డాక్టర్ వెన్నా వల్లభరావు మాట్లాడుతూ నయగర కావ్యంలో 'నా గతం', 'ఈ రోజు', 'చెరసాల' ఖండకావ్యాలు అభ్యుదయ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. కార్యక్రమానికి సొసైటీ సభ్యుడు గోళ్ల నారాయణరావు అధ్యక్షత వహించగా అధ్యక్ష, కార్యదర్శులు మనోహరనాయుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

జగనన్న బీమా పథకంలో కార్మికులకు లేబర్ కార్డ్స్ తప్పనిసరి

భవానీపురం(విజయవాడపశ్చిమ): జగనన్న బీమా పథకంలో రిజిస్టర్ అయిన ప్రతి కార్మికుడికి లేబర్ కార్డ్స్ తప్పనిసరని ఎన్టీఆర్ జిల్లా కార్మిక శాఖ సహాయ అధికారిణి రత్నకుమారి అన్నారు. అసంఘటిత కార్మికులకు ప్రభుత్వ పథకాల అమలుపై ఇండియా లేబర్ లైన్ ఆధ్వర్యంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ నేతృత్వంలో శుక్రవారం గొల్లపూడి పరిధిలోని ఐరన్ యార్డ్‌లో అవగాహన సదస్సు జరిగింది. ఆమె మాట్లాడుతూ జిల్లాలో కార్మికులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇండియన్ లేబర్ లైన్ ఫీల్డ్ మొబలైజర్ ఈశ్వర్ మాట్లాడుతూ ఆపదలో..అవసరాల్లో ఉన్న కార్మికులకు ఇండియన్ లేబర్ హెల్ప్ లైన్ నెంబర్ 18008339020 అండగా ఉంటుందని చెప్పారు. గుంటూరు జిల్లా ఫీల్డ్ మొబలైజర్ సురేష్, ఇండియా లేబర్ లైన్ ప్రాజక్ట్ కో ఆర్డినేటర్ ఎ.మాధవరావు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

● ఉత్సాహంగా వెజిటబుల్స్ డే



విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు దైనందిన జీవితంలో ఎదురయ్యే అంశాలపై అవగాహన కలిపించాలని సిటిజన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి అన్నారు. గురునానక్ నగర్ కాలనీలోని సిటిజన్స్ పాఠశాలలో శుక్రవారం విజిటబుల్స్ డే జరిగింది. కార్యక్రమంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన కూరగాయల ప్రదర్శన ఆకట్టుకుంది. - గుణదల (విజయవాడ తూర్పు)

● సందడిగా వీఎంసీ స్పోర్ట్స్, కల్చరల్ మీట్



ఐజీఎం స్టేడియంలో శుక్రవారం జరిగిన వీఎంసీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌లో మంత్రి ఆదిమూలపు సురేష్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి, కలెక్టర్ ఢిల్లీ రావు, మేయర్ భాగ్యలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే వెలంపల్లి, దేవినేని అవినాష్ తదితరులు

● బీఎస్ఆర్కే స్కూల్లో స్పోర్ట్స్ డే



బీఎస్ఆర్‌కే స్కూల్లో శుక్రవారం జరిగిన స్పోర్ట్స్‌డేలో స్పోర్ట్స్ టార్చ్‌ను వెలిగిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, స్కూల్ సిబ్బంది, అమ్మ సభ్యులు

సీఎం జగన్‌తోనే సంక్షేమం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దేశంలో సంక్షేమానికి సరికొత్త నిర్వచనం ఇచ్చిన వ్యక్తి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని, నేడు ఆయన తనయుడు, మన సీఎం జగనన్న ఆయనకంటే మరో రెండు అడుగులు ముందుకేసి అసాధ్యమైన అభ్యుదయ పథకాలను కూడా సుసాధ్యం చేసి చూపుతున్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ 258వ వార్డ్ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన సింగ్‌నగర్ పైపులరోడ్డు, కేఎల్‌రావు వీధి, తిలక్ రోడ్డు, శుభోదయ స్కూల్ రోడ్లలో వి198 గడపలను సందర్శించారు. గడిచిన మూడున్నరేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, లబ్ధిదారులకు సీఎం జగనన్న రాసిన లేఖను గురించి వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు తీసుకున్నారు. కార్పొరేషన్ సీడీఓ జగదీశ్వరీ, వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఎండీ అఫ్రోజ్, తోపుల వరలక్ష్మి, అశోక్, శ్యామ్, క్రాంతి, నేరెళ్ల శివప్రసాద్, వలి తదితరులు పాల్గొన్నారు.

హస్త కళలను ఆదరిద్దాం

కలెక్టర్ ఢిల్లీరావు



క్రాఫ్ట్ బజారులో కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యేలు విష్ణు, వెలంపల్లి

లబ్బీపేట(విజయవాడతూర్పు): చేనేత, హస్త కళలను ఆదరించాలని, కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ, లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియం ఆధ్వర్యాన సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో క్రాఫ్ట్ బజార్ ఏర్పాటు చేశారు. శుక్రవారం కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్, హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ ప్రభాకరన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆలోచనలు ఆవిష్కరించడానికే..

ఎస్సార్కేలో ఉత్సాహంగా ఐడియాతాన్



సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ ద్వారా ప్రజెంటేషన్ ఇస్తున్న విద్యార్థినులు

రామవరప్పాడు: విద్యార్థుల్లో నూతన ఆలోచనలను ఆవిష్కరించడానికి ఎనికేపాడు ఎస్సార్కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం 'ఐడియాతాన్ –2023'ను ఉత్సాహంగా నిర్వహించారు. 25 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులు 35 బృందాలుగా విడిపోయి తమ ఆలోచనలు, ఇన్నోవేటివ్ ఐడియాస్‌ను వెలికితీసి ప్రోటోటైప్ నమూనాలు, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌లతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్స్ ద్వారా వివరించారు. బ్లాక్ చైన్ టెక్నాలజీ, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్‌లో అధునాతన పద్ధతులు వివరించి పలువురి మన్ననలు అందుకున్నారు. ప్రజెంటేషన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ధనలక్ష్మి, ప్రేమ్ సాగర్, ఈశ్వర్‌లకు ప్రథమ బహుమతి, ఆంధ్ర లయోల కళాశాలకు చెందిన శివరామ తేజ, సంపత్ కుమార్‌లకు ద్వితీయ బహుమతులు అందజేశారు. జేఎన్‌టీయూ కాకినాడ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎ. కృష్ణమోహన్, కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు, చైర్మన్ బోయపాటి అప్పారావు, సెక్రటరీ శ్రీకృష్ణ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆకాలత, పి.కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డీఈఓ రేణుక

గుణదల (విజయవాడ తూర్పు): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రేణుక అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో శుక్రవారం డిజిటల్ సిస్టమ్ సపోర్ట్ ప్రోగ్రామ్ జరిగింది. ఆమె మాట్లాడుతూ కంప్యూటర్ విద్యపై పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి లయోల కళాశాల యాజమాన్యం వీఎంసీ పాఠశాలలకు 40 కంప్యూటర్లు ఉచితంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విద్యా శాఖ సూపరింటెండెంట్ కుమార్, వీఎంసీ పాఠశాలల సూపర్‌వైజర్ రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

59వ డివిజన్‌లో ఫ్రైడే.. డ్రైడే



సింగ్‌నగర్‌లో అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు, సిబ్బంది

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని కార్పొరేషన్ డీఐఓ, ఫ్రైడే– డ్రైడే స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ అమృత అన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో 'ఫ్రై డే– డ్రై డే' అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ దోమ పుట్ట కూడదు.. దోమ కుట్ట కూడదు అనే నినాదంతో కార్పొరేషన్ హెల్త్ విభాగంలోని అధికార యంత్రాంగం, సిబ్బంది అంతా సమిష్టిగా పనిచేస్తున్నారని తెలిపారు. అనంతరం సింగ్‌నగర్‌లో ర్యాలీ చేశారు. కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా, డీఎంఓ మోతిబాబు, బయాలజిస్ట్ సూర్యనాయక్, మలేరియా ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, నేత ఎండీ హాఫీజుల్లా తదితరులు పాల్గొన్నారు.